# మళ్ళీ మొదలైన కథ

నడవలేక నడుస్తున్నాడు అప్పుడు. నడుస్తుంటే అడుగులు తడబడుతున్నాయి. భారంగా వేయలేక వేయలేక అడుగులు వేస్తున్నాడు. కళ్ళు తిరుగుతున్నాయి. చెవుల్లోంచి వేడి వస్తోంది. ఇంత ముందుకు నడవలేక రోడ్డు ప్రక్కన చెట్టు క్రింద కూర్చుండి పోయాడు. నీరసంతో సోలివస్తోంది.

అదేమి కర్మమో రెండు రోజుల నుంచీ గుప్పెడు మెతకులు వేసినవారు లేకపోయారు. జ్వరం వచ్చి మూడురోజులు మూల పడేసింది అప్పుడ్ని. అదేమి మాయదారి జ్వరమో గాని, మనిషిని పీల్చి పిప్పి చేసేసింది. అక్కడికి ఓ రోజున, ఓపిక చేసుకుని ధర్మాసుపత్రికి వెళ్ళాడు. అక్కడ గంటలకొద్దీ నిలబడేసరికి, కళ్ళు బైరులు గమ్మి ప్రాణం అక్కడే పోతుందేమోననిపించింది. మూడు గంటల తర్వాత, ఆస్పత్రివాళ్ళు మూడు గుటలకల ఎర్రటి నీళ్ళు ధర్మం చేశారు. కాని ఆ ఎర్రనీళ్ళు మాత్రం తమ ధర్మం నెరవేర్చలేదు. ఇంక ఓపికలేక మళ్ళీ ఆస్పత్రి ముఖం చూడలేదు. వచ్చిన జ్వరం అప్పటితో మూడురోజులు కాపురము చేసి, తర్వాత విడాకులిచ్చి, వెళ్ళిపోయింది. కాని పోతూ పోతూ పరిహారంగా వాడి ఓపికనంతా పుచ్చుకుని చక్కా పోయింది. 'లంకణం పరమౌషధం' అంటారు. ఆ మూడు రోజులూ బలవంతాన లంఖణం చేయడం వల్లనో ఏమో, జ్వరం అట్టే తగ్గిపోయింది.

నాలుగోరోజు సూర్యుడితోపాటు తానూ ఊరు ముఖం చూశాడు అప్పుడు. లేని ఓపిక తెచ్చుకుని, పడుతూ, లేస్తూ నగర సంచారం మొదలుపెట్టాడు. ఏమి ప్రారబ్దమో కాని ఒక్క తల్లి కూడా గుప్పెడు మెతకులు వేయలేదు. ఆరోజు మహాత్య మెటువంటిదో కాని, మరునాడు కూడా తిరగడమే మిగిలింది కాని, గుటికెడు గంజైనా దొరకలేదు. మూడోరోజు కూడా క్రితం రెండు రోజుల సాంప్రదాయం నిలబడేటట్లే అనిపించింది. మధ్యాహ్నం పన్నెండు గంటలవుతున్నా, ఏమి చిత్రమో కాని, ఏమాత్రమూ ముష్టి దొరకలేదు.

చెట్టుకింద కూర్చున్న అప్పుడికి, ఊరి వారందరి మీదా కోపం ఉరకలు వేస్తోంది. కాని పేదవాడి కోపం పెదవికి చేటన్నట్లు, వాడికి కోపం వస్తే మాత్రం ఏమి ప్రయోజనం? అప్పడికి తాను ఏనాడో శ్రీరామ నవమి పందిళ్ళలో విన్న హరికథలోని అంశం జ్ఞాపకానికి వచ్చింది. ఓసారి పార్వతీదేవి వ్యాసుల వారిని పరీక్షించాలనుకొని, కాశీలో ఆయనకు అన్నం దొరకకుండా చేసిందట. దాంతో ఆయనకి కోపం వచ్చి కాశీ వాసుల నందరినీ శపించబోయాడుట. అదేదో మహర్షి కనుక ఆయనకే చెల్లింది. కాని, తనబోటి ముష్టివాడికేం చెల్లుతుంది?

దగ్గరలో మైక్‌లోంచి రికార్డులు మ్రోగజొచ్చాయి. అప్పడి ఆలోచనలకు అంతరాయం కలిగింది అదేదో పెళ్ళివారి ఇల్లు అయి ఉంటుంది. అక్కడికి పోతే కనీసం పుల్లిస్తరాకులైనా, దొరుకుతాయే మోనని ఆశ కలిగింది. పోదామని ఆత్రంగా లేచాడు. కాని ఒళ్ళు తిరిగి పోయేటట్లనిపించి మళ్ళీ

కూర్చున్నాడు. ఒక ఐదు నిమిషాల సేపు అల్లాగే కూర్చుని, పట్టు బలవంతం మీద తిరిగి లేచాడు. ప్రక్కనే పెట్టుకున్న జోలిని ప్రయత్నం మీద ఒంటి చేతికి తగిలించుకున్నాడు.

ఆయాసపడుతూ నడుస్తున్న అప్పడి మనస్సు అనేకమైన ఆలోచనలతో అల్లకల్లోలంగా ఉంది. తన దౌర్భాగ్యపు బ్రతుక్కి తోడు ఒంటిచెయ్యి ఒకటి. అది సరిగ్గా ఉంటే ఏ కూలీ నాలో చేసుకొని బ్రతికేవాడు. తాను చేసుకున్న పాపానికి ఎవరేం చేయగలరు?

అప్పడికి తన చిన్ననాటి సంఘటన జ్ఞాపకానికి వచ్చింది. అప్పుడు వాడికి పదేళ్ళు ఉంటాయి. తండ్రితోపాటు వాడూ ముష్టికి వెళుతుండేవాడు. ఎవరూ చూడని చోట చిల్లర దొంగతనాలు చేయడానికి వాడిని తండ్రి ప్రోత్సహిస్తుండేవాడు. ఆ అలవాటు చొప్పునే ఒకసారి జమీందారుగారి మామిడితోటలో తోటమాలి లేకుండా చూసి, కాయలు కోయసాగాడు. దూరాన్నుంచి మాలి రావటం చూసి, కంగారుగా చెట్టుమీంచి దూకేసి పరుగెత్తడం మొదలు పెట్టాడు. ఆ అలికిడి విని, మాలి చూసి, అప్పడిని తరుముకు రాసాగాడు. అప్పుడు కంగారుగా పరుగెడ్తూ, ముళ్ళకంచె దూకి పారిపోదామని ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో ముళ్ళ తీగెకు చేయి గీచుకుపోయి రక్తం కారడం మొదలు పెట్టింది. గుప్పెడు మట్టి తీసి గాయం మీద వేసి పట్టుబడకుండా పారిపోయాడు.

తోటమాలి నుంచి తప్పించుకోగలిగాడే కాని, గాయాన్నుంచి మాత్రం తప్పించుకోలేక పోయాడు. అప్పుడు మర్నాటికల్లా చీము పట్టింది గాయం. జ్వరం కూడా వచ్చింది. అయినా లెక్కచేయలేదు. వాళ్ళమ్మ యిచ్చిన కషాయం త్రాగిపడుకున్నాడు. రెండు రోజులకి జ్వరం తగ్గింది. పుండు పెచ్చు కట్టింది.

నెల రోజులు తిరక్కుండా ఓరోజున చలిజ్వరం వచ్చినట్లు వణుకువచ్చి స్పృహలేకుండా పడిపోయాడు అప్పడు. గోలు గోలున ఏడ్చుకుంటూ వాడిని ఆస్పత్రికి తీసుకువెళ్ళారు వాడి అమ్మా నాన్నా. డాక్టరు వాడిని పరీక్షించి 'సెప్టిక్ అయింది' అన్నాడు. అదేమిటో అర్థం కాలేదు వాళ్ళకి. వాడిని వెంటనే ఆస్పత్రిలో చేర్చుకున్నారు. ఆ తర్వాత గాయం అయిన కుడిచేతిని తీసివేశారు.

ఈ సంఘటన జరిగిన తర్వాత అప్పడి నాన్న ఎక్కువ రోజులు ఉండకుండా ఈ లోకం నుంచే శాశ్వతంగా సెలవు పుచ్చుకున్నాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే, వాడి అమ్మ - అప్పడినీ, ఈ ఊరిని వదిలేసి ఎక్కడికో వెళ్ళిపోయింది. అందరూ 'లేచిపోయింది' అన్నారు. అందరూ అంటున్న మాటను విన్నాడు కాని, ఆ మాటకి అర్థం ఏమిటో తెలియలేదు అప్పడికి. అప్పటినుంచీ, అంతవరకూ తండ్రితో కలిసి సమిష్ఠిగా జరపుతూ వచ్చిన యాచన వృత్తిని ఏకాకిగా ఏకధాటిగా సాగించడం మొదలు పెట్టాడు.

మైక్ వినిపిస్తున్న ఇల్లు సమీపించేసరికి, అప్పడి ఆలోచనలకు అంతరాయం కలిగింది. అప్పుడే భోజనాలు అయ్యాయి కాబోలు ఎవరో ఒకమేటి పుల్లిస్తరాకులు చెత్తకుండీ దగ్గర పడేశారు. ఆ ఆకు మీద ఒక్క ఉదుటను, ఒక యానాది మూక విరుచుకుపడింది. వారి వెనక నాలుగు కుక్కలు కూడా వాటిని పంచుకోబోయాయి. కాని యానాదులు వాటిని రాళ్ళతో కొట్టి తరిమి వేశారు. అవి 'కుయ్యో' మంటూ ఏడ్చుకుంటూ, పరుగెత్తుకుంటూ వెళ్ళి దూరంనుంచే, నాలిక ఆడిస్తూ, ఆకులవైపు ఆశగా చూస్తుండ సాగాయి.

ఆ కుక్కలని చూసి జాలిపడ్డాడు అప్పడు. వాటికి కొంచెం వేస్తే ఏం పోయింది వాళ్ళకి అనుకున్నాడు. లేచి ఓపిక తెచ్చుకుని ఆశగా ఆ ఆకులవైపు నడిచాడు. ముందుకు వంగి వాటిలోని ఎంగిలి పదార్థాలు కొంచెం తీసుకుపోయాడు. "గయ్యి" మంటూ కాట్లకుక్కల్లాగా అరిచారు

యానాదులు.

"పొద్దుగాల నుంచీ యీడకూసుంటే - నవ్వు యాడివిరా ఇప్పుడొచ్చి తీస్కోబోతుండావ్! పో ..... పో...." అని కసిరారు వాళ్ళు.

"మూడు రోజుల నుంచీ ముద్దలేదు. కొంచెం ఇయ్యండయ్యా" అన్నాడు అప్పుడు దీనంగా.

"ఎల్లు బే .... సెప్తుంటే నీకు కాదూ?" అంటూ కసిరాడు ఇంకొకడు కొరకొరా చూస్తూ.

కొంచెంసేపు అక్కడే ఉండి ఇక లాభం లేదనుకుని, ఉసూరుమంటూ, కాళ్ళీడ్చుకుంటూ నడవసాగాడు.

మరికొంచెం దూరంలో, రోడ్డుమీద ఏదో సంతర్పణ జరుగుతోంది. ఎంతోమంది ముష్టివాళ్ళు అక్కడికిపోయి, భోజనాలు చేస్తున్నారు.

"ఏందిరా ఇది?" అని అడిగాడు అప్పుడు, అక్కడ తెలిసిన ఒక ముష్టివాడు కనిపిస్తే.

"రెడ్డిదొర ఎన్నికల్లో నిలబడతుండాడంట. మన ఓట్ల కోసం కూడు బెట్టుంటాడు." అంటూ సగం వ్యంగ్యం మిళితం చేస్తూ జవాబు చెప్పి వెళ్ళిపోయాడు ఆ ముష్టివాడు. కూడు అనగానే ప్రాణం లేచివచ్చింది అప్పుడికి. ముందుకి మూడు అడుగులు వేశాడు.

"ఆగు" అన్న కంఠస్వరం విని అక్కడే ఆగిపోయాడు.

"నీవు వెంకటరెడ్డి మనిషివా?" అంది ఆ కంఠం.

అదేమిటో అర్థంకాలేదు అప్పుడికి. ఏం చెప్పాలో తెలీలేదు.

ఎందుకేనా మంచిదని "అవును దొరా" అన్నాడు.

"అయితే పో .... ఇక్కడ పుల్లారెడ్డి గారి మనుషులకే కూడు దొరుకుతుంది" అంది ఆ కంఠం కర్కశంగా.

అప్పుడి నెత్తిన పిడుగుపడినట్లయింది. నోటిముందు కూడు పోతుంటే నోటమాట రాకపోయింది, కాస్త సంభాళించుకుని "అదికాదు దొరా...." అంటూ ఏదో చెప్పబోయాడు.

"పోరా..... ఎన్నిమాట్లు చెప్పాలి? అడుగు ముందుకి వేశావంటే మక్కెలు విరగతంతాను. జాగ్రత్త" అంటూ రెండడుగులు ముందుకు వేశాడు ఆ వ్యక్తి. అసలే కైపుమీద ఉన్నాడేమో అతని కళ్ళు చింతనిప్పుల్లాగా ఉన్నాయి.

ఇంక అప్పుడిలో సహనం పూర్తిగా నశించింది. వాడిమీద వాడికే అసహ్యం వేసింది. "నా అన్నవాళ్ళు లేని ఈ దిక్కుమాలిన జీవితం ఎవరికోసం గడపాలి? లేదు, ఇంక బ్రతకడం అనవసరం. ఏమైనా సరే ఇప్పుడే పోయి ఊరవతల చెరువులో దూకి ప్రాణం తీసుకోవాలి అనుకున్నాడు అప్పుడు. ఆవేశంతో వళ్ళు వేడెక్కిపోయింది. చచ్చిపోవాలనే దృఢాభిప్రాయంతో తెలియకుండానే ఓపిక వచ్చి, వడివడిగా నడవడం మొదలు పెట్టాడు అప్పుడు.

మరో పావుగంటలో ఊరి చివర చెరువు జేరుకున్నాడు అప్పుడు. జన సంచారం అరుదుగా ఉంది; చుట్టూ ఒకసారి కలియజూశాడు. నీళ్ళలోకి దిగాడు. నడుచుకుంటూ మొలలోతు వరకు వెళ్ళాడు. మళ్ళీ ఒకసారి అన్నివైపులా కలయజూశాడు. కొంచెం దూరంలో ఎవరో కాకులకి పిండాలు వేస్తున్నారు. ప్రక్కనే శ్మశానం ఉంది. "మనుష్యులకి లేదు కాని కాకులకి అన్నం వేస్తున్నారు. ఏం మనుషులు?" అని తనలో తాను గొణుక్కున్నాడు.

గాలివాలుగా ఉందేమో వాళ్ళ మాటలు వినవస్తున్నాయి.

"ఇంకేం చేస్తామండీ" అని ఎన్ని అనుకున్నా ఈ పిండాన్ని కాకులు ముట్టటం లేదు. మరి

ఆ ప్రేతాత్మ కోరిక ఏమిటో? ఎంతసేపని ఉంటాం? అవి అల్లా వదిలి పోదం పదండి. మనం వెళ్ళిపోతే తింటాయేమో!" అంది ఒక కంఠం.

"సరే పదండి" అంది రెండో కంఠం.

మరునిముషంలో ఇద్దరూ పోవడం గమనించాడు అప్పుడు. అప్రయత్నంగా వెనక్కి తిరిగాడు. నీటిలోంచి బయటకు వచ్చాడు. వడివడిగా అడుగులు వేసుకుంటూ, ఆ పిండాలవైపు బయలుదేరాడు. ఎదురుగా అటువైపే ఒక కుక్క వస్తోంది ఆ పిండాల కోసం. ఎక్కడి నుంచి వచ్చిందో ఓపిక - పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ఒక రాయిని విసురుగా కుక్క మీదికి విసిరాడు "కుయ్యో!" మంటూ ఏడ్చుకుంటూ ఆ కుక్క పారిపోయింది. అప్పుడిలోని జాలి ఎక్కడికి పోయిందో!

ఉరుకులు పరుగులు మీద ఆ పిండాల దగ్గరకి జేరాడు అప్పుడు. వాటిని అప్యాయంగా తీసుకొని రవ్వ లడ్డూలలాగా తినడం మొదలుపెట్టాడు. ఆకలి రుచి ఎరుగ దంటారు. ఒక్క మెతుకైనా వదలకుండా వాటిని తినేసి, తిరిగి చెరువుకి వెళ్ళాడు. కడుపునిండా నీళ్ళు త్రాగి, గర్రున త్రేన్చి తాపీగా ఊరివైపు నడుచుకుంటూ వెళ్ళాడు. అప్పడిలో చచ్చిపోవాలనుకునే కోరిక ఎక్కడికి పోయిందో! బహుశా పిండాల క్రింద పడి పిండయి పోయి ఉంటుంది!

మళ్ళీ మొదలైంది కథ.

*(స్వాతి మంత్లీ, మార్చి 1974)*